# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 12 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 22 ఏప్రిల్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్




## మణిపూర్‌లో 11 చోట్ల రీపోలింగ్


ఇంఫాల్: ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం): మొదటి దశ ఎన్నికల్లో భాగంగా ఏప్రిల్ 19న మొత్తం 21 రాష్ట్రాల్లో 102 పార్లమెంటరీ నియోజకవర్గాలకు ఓటింగ్ ప్రక్రియ జరిగింది. అయితే మణిపూర్ పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 11 చోట్ల హింసాత్మక వాతావరణం చోటు చేసుకోవడం వల్ల, అక్కడ రీపోలింగ్ నిర్వహించనున్నట్లు ప్రధాన ఎన్నికల అధికారి ప్రకటించారు. హింసాత్మక ..మిగతా 2లో

## ఇండియా కూటమి అధికారంలోకి వస్తే సీఏఏ రద్దు చేస్తాం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం): కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రాగానే కీలక హామీలను నెరవేరుస్తామని మాజీ కేంద్రమంత్రి, కాంగ్రెస్ నేత పి.చిదంబరం అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ), బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు క్రిమినల్ చట్టాలను రద్దు చేస్తామని ఆదివారం ఆయన హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే కొన్ని చట్టాలను సవరించడం లేదా రద్దు చేస్తామని చెప్పారు. వీటిలో సీఏఏ మొదటిస్థానంలో ఉందని, పార్మర్స్ ప్రొడ్యూస్, ట్రేడ్, అండర్ కామర్స్ ప్రమోషన్ ఆఫ్ ఫెసిలిటేషన్ యాక్ట్-2020, భారత న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్షా యాక్ట్ వంటి చట్టాలు ఉన్నాయన్నారు. 'బెయిల్ రూల్, జైల్ మినహాయింపు' అనే సూత్రాన్ని అమలు చేసేందుకు ప్రత్యేక చట్టాన్ని కూడా ..మిగతా 2లో

## బెంగాల్‌లో సీఏఏ అమలును ఎవరూ ఆపలేరు



కోల్‌కతా, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం): బీజేపీ ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేరుస్తుందని, పశ్చిమ బెంగాల్‌లో సీఏఏ అమలును ఎవరూ ఆపలేరని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్ మాల్దా ఉత్తర నియోజకవర్గ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి ఖగెన్ ముర్ముకు మద్దతుగా ఎన్నికల ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్ నాథ్ సింగ్ మాట్లాడుతూ.. పౌరసత్వ (సవరణ) చట్టం 2019 పౌరసత్వాన్ని రద్దు చేసేందుకు ఉద్దేశించినది కాదని, మతపరమైన ప్రాతిపదికన పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ నిర్వాసితులకు భారత పౌరసత్వం మంజూరు చేసే చట్టమని అన్నారు. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ లేదా లెఫ్ట్ పార్టీలు ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేస్తుంటాయి. వాటిని నెరవేర్చలేదు. కానీ బీజేపీ తన వాగ్దానాలను నెరవేరుస్తుంది. పశ్చిమ బెంగాల్‌లో సీఏఏని అమలును ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు. తన రాష్ట్రంలో సీఏఏను అనుమతించబోమని సీఎం మమతా బెనర్జీ చెబుతున్నారని, రాష్ట్ర ప్రజలను ..మిగతా 2లో

# రాజ్యాంగాన్ని రక్షించాలంటే రాహుల్ ప్రధాని కావాలి

### నాతో పాటు ఎవరికైనా ముఖ్యమంత్రి అర్హత ఉందంటే అది కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికే

### భువనగిరి ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి



భువనగిరి, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం): భువనగిరి ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాక్యలు చేశారు. కేసీఆర్ హైదరాబాద్‌లోని ఆంధ్రా వాళ్లను బెదిరించి లక్షలు వసూలు చేశారని ఆరోపించారు. తెలంగాణ సాధన కోసం మంత్రి పదవికి రాజీనామా చేసిన ఘనత కోమటిరెడ్డి వెంకటరెడ్డిదే అని కొనియాడారు. 2009లో ఢిల్లీ దద్దరిల్లేలా తెలంగాణ నినాదాన్ని వినిపించి, పార్లమెంట్ స్తంభింపచేసి, 2014లో తెలంగాణ రాష్ట్రాన్ని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సాధించారని అన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ నిబద్ధత గల కాంగ్రెస్ సైనికులని సీఎం అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రాజీనామా డ్రామాలో ఉపఎన్నికలు తీసుకువచ్చి, హైదరాబాద్లో ఉన్న ఆంధ్రవాళ్లను బెదిరించి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. దొరవారి గడిలో సారాపోసిన వ్యక్తి జగదీష్ రెడ్డి అని విమర్శించారు. నాతో పాటు ఎవరికైనా ముఖ్యమంత్రి అర్హత ఉందంటే అది కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికే అని రేవంత్ రెడ్డి అన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ నాకు కుడి, ఎడమ భుజాలని అన్నారు. వీరిద్దరు కాంగ్రెస్ పార్టీకి డబుల్ ఇంజన్లు అని అభివర్ణించారు. పార్టీ నిర్ణయంతో తనకు ముఖ్యమంత్రి పదవి వచ్చిందని, ఈ పదవిని బాధ్యతగా చూశానని, అహంకారంతో వ్యహరించలేదని అన్నారు. పేదవాడి సంక్షేమం కోసం, తెలంగాణను అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు పనిచేస్తున్నానని చెప్పారు. ముఖ్యమంత్రి కాకముందు తను కార్యకర్తలు ఎలా కలిశారో, సీఎం అయిన తర్వాత కూడా కాంగ్రెస్ కార్యకర్తలు కలుస్తున్నారని చెప్పారు. కమ్యూనిస్ట్ పార్టీ నాయకులను, నేతలను కేసీఆర్ ఏనాడు గౌరవించలేదని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఇండియా కూటమి అధికారంలోకి రావాలని, రాహుల్ ప్రధాని కావాలని అన్నారు. కాంగ్రెస్ని ఎందుకు ఓడించాలో సీఎం కేసీఆర్ చెప్పాలని ప్రశ్నించారు. సంక్షేమంలో దూసుకుపోతుంటే, కేసీఆర్ మాత్రం ప్రభుత్వం కూలుతుందని శాపనార్థాలు పెడుతున్నారని మండిపడ్డారు. నరేంద్రమోడీ దెబ్బకు ప్రజస్వామ్య వ్యవస్థలు కుప్పకూలుతున్నాయని, ఈడీ, ఐటీ, సీబీఐని వాడుకుని దేశాన్ని ఆక్రమించుకోవాలని అనుకుంటున్నారని ఆరోపించారు. మోడీకి కేసీఆర్ అన్ని విషయాల్లో మద్దతు ఇచ్చారని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీని బొందపెట్టాలని ప్రజలను కోరారు. మా జోలికి వస్తే కోమటిరెడ్డి బ్రదర్స్ బొందపెడతారని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. తెలంగాణ ఏర్పాటును ప్రధాని మోడీ తప్పుపట్టారని, బీజేపీకి ఓటు అడిగే అర్హత లేదని అన్నారు.



### తెలంగాణ కోసం 14 ఏళ్లు

## కష్టపడింది మేము

### పేరొచ్చింది కేసీఆర్‌కు

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం): 14 ఏళ్లు తెలంగాణ కోసం కొట్లాడిన పేరు కేసీఆర్ కి రావొచ్చు కానీ కష్టపడింది మేము అని మల్కాజ్‌గిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అని సంచలన వ్యాఖ్యలు చేశారు. కూకట్ పల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోని అస్మద్ పేటలో పప్పుపటేల్ నివాసంలో స్థానికులు ఏర్పాటుచేసిన బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ కి ఈటల రాజేందర్ హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా మొదటి సారి అనుకుంటా.. ఓటు వేయడానికి ఇష్టపడని వారు కూడా మోడీ గారి పదేళ్ల పాలన చూసి ఓటు వేయడానికి ముందుకు వస్తున్నారని తెలిపారు. మోడీ నాయకత్వంలోనే దేశం పురోభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారని అన్నారు. 2014లో 273 సీట్లతో సంకీర్ణ రాజకీయాలకు స్వస్తిపలికిన నాయకుడు మోడీ అన్నారు. మోడీ మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచి ముఖ్యమంత్రి ..మిగతా 2లో

## రేవంత్ రెడ్డిని మెదక్‌కు రప్పించిన ఘనత కేసీఆర్‌ది

### మెదక్ ప్రెస్‌మీట్‌లో హరీశ్‌రావు



మెదక్, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం): మెదక్‌ను జిల్లా చేస్తామని చెప్పి ఇందిరా గాంధీ మోసం చేస్తే ఆ కలను కేసీఆర్ నెరవేర్చారని బీఆర్ఎస్ నాయకుడు హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చెప్పవన్నీ అబద్ధాలే అని విమర్శించారు. మెదక్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో హరీశ్‌రావు మాట్లాడారు. మెదక్ రాందాస్ చౌరస్తా మీదుగా నామినేషన్‌కు వెళ్లావ్ కదా.. అక్కడ అభివృద్ధి కనిపించలేదా అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. నువ్వు నామినేషన్‌కు వెళ్లిన కలెక్టరేట్ కట్టింది కేసీఆర్.. నిన్ను మెదక్‌కు రప్పించిన ఘనత కేసీఆర్‌ది అని అన్నారు. మెదక్‌కు రైలు తెచ్చింది కేసీఆర్ అని హరీశ్‌రావు తెలిపారు. వంద కోట్లు ఖర్చు చేసి రైల్వే లైన్ తీసుకొచ్చారని.. మూడు జిల్లాలు చేసి, మూడు మెడికల్ కాలేజీలు ఏర్పాటుచేశారని పేర్కొన్నారు. చిట్టచివరి ఆయకట్టుకు నీళ్లిచ్చారని.. ఇంత చేసినా కేసీఆర్ ఏమీ చేయలేదంటున్నావని రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడుపాయల అమ్మవారికి కేసీఆర్ వందకోట్లు ఇస్తే వాపసు తీసుకున్నాడని.. రేవంత్ రెడ్డికి అమ్మవారి ఉసురు తగులుతుందని మండిపడ్డారు. అబద్ధాలు ఆడడంలో రేవంత్‌కు ఆస్కార్ అవార్డు ఇవ్వాలని హరీశ్‌రావు అన్నారు. ఉరికిచ్చి కొడ్తా, పేగులు మెడలే వేసుకుంటా, బొందపెడ్తా, మానవ బాంబునవుతా అని రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని.. ఒక సీఎం ఇలాగేనా మాట్లాడాల్సిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హామీల గురించి అడిగితే హెచ్చరిస్తున్నారని.. కేసులు పెడుతున్నారని ..మిగతా 2లో

### మాజీ మంత్రి తెలంగాణ ఉద్యమకారుడు

## పట్లోళ్ల ఇంద్రారెడ్డి 24వ వర్ధంతి నేడు



బుద్వేల్, ఏప్రిల్21(ప్రభాత ఉదయం): మాజీ మంత్రి, తెలంగాణ ఉద్యమ కారులు పట్లోళ్ల ఇంద్రారెడ్డి 24వ వర్ధంతిని సోమవారం నిర్వహించనున్నారు. ప్రజా నాయకుడిగా పేరు సంపాదించుకొని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని పొందుకున్న పట్లోళ్ల ఇంద్రారెడ్డి మరణించి 24 సంవత్సరాలు కావస్తున్న నేటికీ ఆయన పేరు వింటే మన మధ్యలోనే ఉన్నాడనే ఊహ కలుగుతుంది. రంగారెడ్డి జిల్లాలో గ్రామ గ్రామాన ప్రజల పేరు పెట్టి పిలిచే నాయకుడిగా ఇంద్రన్న కు పేరుంది. రాజకీయాలలో ఇంద్రన్న ధైర్యాన్ని చూసి భవిష్యత్తులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు ఆయన ముఖ్యమంత్రి అవుతారని అప్పట్లో అందరూ గుర్తు చేసుకునేవారు. అయితే 2000 సంవత్సరం ఏప్రిల్ 22న ఆయన మరణం ముఖ్యమంత్రిగా చూడాలనుకున్న ప్రజల ఆశలను నిరాశపరిచింది. నేటికీ ఇంద్రన్న పేరు వింటే ఆనాడు ఆయనతో గడిపిన మధుర క్షణాలు, ఆయన మాట్లాడిన తీరు, సమస్యల పైన ఆయన స్పందించిన విధానం గుర్తుకు వస్తుంది.

**కౌకుంట్లలో జన్మించిన ఇంద్రన్న :**

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం కౌకుంట్ల గ్రామంలో కళ్యాణమ్మ - కృష్ణారెడ్డి ల పుణ్య దంపతులకు 1954 అక్టోబర్ 4వ తేదీన ఇంద్రారెడ్డి జన్మించారు. ఇంద్రారెడ్డి ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ ఎల్ఎల్ బి పూర్తి చేశారు. ఉస్మానియా లా కాలేజీ స్టూడెంట్ యూనియన్ ప్రెసిడెంట్ గా ఎన్నికై ఎమర్జెన్సీ సమయంలో 18 నెలల పాటు జైలు జీవితం గడిపారు.

**రాజకీయ జీవితం :**

పట్లోళ్ల ఇంద్రారెడ్డి కౌకుంట్ల గ్రామ సర్పంచిగా ఎన్నికై తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 1983లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో లోక్ దళ్ పార్టీ తరపున చేవెళ్ల అసెంబ్లీకి పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత 1985లో టీడీపీలో చేరి చేవెళ్ల నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎన్టీ రామారావు మంత్రివర్గంలో విద్య, కార్మిక, ..మిగతా 2లో



## మరో అభ్యర్థుల జాబితాను విడుదల చేసిన కాంగ్రెస్

2

### 24న తెలంగాణ

## ఇంటర్ ఫలితాలు



హైదరాబాద్, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం): తెలంగాణ ఇంటర్ పరీక్ష ఫలితాలు ఈ నెల 24న విడుదల కానున్నాయి. ఉదయం 11 గంటలకు విడుదల చేస్తామని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ప్రథమ, ద్వితీయ ..మిగతా 2లో

# తెలంగాణ కోసం 14 ఏళ్లు కష్టపడింది మేము పేరొచ్చింది కేసీఆర్‌కు

మొదటి పేజీ తరువాయి...

అయ్యారని తెలిపారు. మొదటిసారి ఎంపీగా గెలిచి ప్రధాని అయ్యారని ఇది చాలా అరుదు. మోడీలో ఏదో తెలియని ప్రత్యేకత ఉంది.. ఆయన చేసే పనే మాట్లాడుతుందన్నారు. పక్కదేశాలు భారత్ భూమిని ఇంచుకూడా ఆక్రమించుకోకుండా చేశారన్నారు. మనవైపు కన్నెత్తి చూడడానికే భయపడుతున్నారని తెలిపారు. కాశ్మీర్ లోని లాల్ చౌక్ లో భారత మువ్వన్నెల జెండా స్వేచ్ఛగా ఎగురవేస్తున్నామని తెలిపారు. ఒకే దేశం ఒకే చట్టం ఒక కల ఉండే.. దానిని నిజం చేశారు మోడీ అన్నారు. మోడీకి ఒకప్పుడు అమెరికా వీసా నిరాకరిస్తే.. ఇప్పుడు వారి సెనేట్ లో జై మోడీ అని చప్పట్లు కొట్టించుకున్నారు. అమెరికా అధ్యక్షుని భుజం మీద చేయి వేసి మాట్లాడే స్థాయికి వచ్చామన్నారు. అప్పులు తెస్తే తప్ప గడవని భారతదేశ ఆర్థిక వ్యవస్థను 11 వ స్థానం నుండి 5 స్థానానికి తీసుకువచ్చారు. మళ్ళీ అధికారం ఇస్తే మూడవ స్థానానికి తీసుకువస్తాం అనీ హామీ ఇస్తున్నారన్నారు. ఎదిగిన దేశాల సరసన నిలబెడతామంటున్నారని తెలిపారు. మోడీ కంటే ముందు 3 ఎయిమ్స్ ఉంటే ఈ పదేళ్లలో 16 ఎయిమ్స్ వచ్చాయి. ఏం చేశారు అని కాంగ్రెస్ వారు ఓటు అడుగుతారు.. వారికి నైతికత లేదన్నారు. గునియ దేశానికి వాక్సిన్ అందించినందుకు.. మోడీ అదేశానికి వెలితే దేశ సంప్రదాయాలు పక్కనపెట్టి స్వాగతం పలకడమే కాకుండా.. ఆ దేశ అధ్యక్షుడు మోడీ గారికి పాదాబివందనం చేశారు అంటే మన గొప్పతనం అర్థం చేసుకోవాలన్నారు.
కోల్పోయిన రామాలయాన్ని తిరిగి నిర్మించి దేశానికి ఉన్న అరిష్టాన్ని తొలగించిన నాయకుడు మోడీ అన్నారు. మోడీ అందరివాడు.. ఏ మత గ్రంథాలు మానవుణ్ణి హింసించమని, బాధ పెట్టమని చెప్పవన్నారు. ట్రిపుల్ తలాక్ తొలగించి ముస్లిం మహిళల అభిమానం చూరగొన్నారని, వారి దుఃఖాన్ని తొలగించారన్నారు. ఓట్ల కోసం కాకుండా.. ప్రజలకోసం నిర్ణయం తీసుకునే నాయకుడన్నారు. బీఆర్ఎస్ ఇప్పుడు ఇర్రలవెంట్ అన్నారు. కాంగ్రెస్ వారు 6 గ్యారంటీలు.. 66 హామీలు ఇచ్చారన్నారు.
ఎవడు ఎటుపోతే నాకేంటి నేను సీఎం అయితే చాలు.. నా పార్టీ అధికారంలోకి వస్తే ఎలా చాలు అని అడ్డమైన ప్రకటనలు చేశారని, నీతి జాతి లేదని మండిపడ్డారు. అదే మోడీ ఎప్పుడు అలవికాని హామీలు ఇవ్వలేదని, ఆయనకు కొడుకులు, బిడ్డలు, సద్దకుని కొడుకులు లేరని, ఆయన బ్రతికితే దేశం కోసం, చనిపోతే దేశంకోసం చనిపోతారన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి చేసిన మాట నిజమే అయితే.. ఎందుకు టాయిలెట్స్ లేవని, 12 కోట్ల టాయిలెట్స్ కట్టించి మహిళల ఆత్మగౌరవం కాపాడారన్నారు. నేను 14 ఏళ్లు తెలంగాణ కోసం కొట్లాడిన.. పేరు కేసీఆర్ కి రావొచ్చు కానీ కష్టపడింది మేమని కీలక వ్యాఖ్యలు చేశారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ప్రాణాలు పణంగా పెట్టి పేషంట్ల మధ్య తిరిగిన బిడ్డను నేనని, ఎవరికి తలవంచకుండా ప్రజల బాగు ఎజెండాగా బ్రతుకుతున్నామన్నారు. రాజకీయాలను స్వలాభం కోసం కాకుండా.. ప్రజల కోసం అనే భావన ఉన్నవాళ్ళమన్నారు. మల్కాజిగిరి సంపూర్ణ అభివృద్ధి ఒక్క బీజేపీతోనే సాధ్యమన్నారు. శశభిషలు లేకుండా సంపూర్ణంగా ఆశీర్వదించాలని కోరారు. 38 లక్షల ఓటర్లను నేను నేరుగా కలిసే



అవకాశం లేదు.. మీరే కథానాయకులై గెలిపించాలని కోరుతున్నామన్నారు. కంటోన్మెంట్ అభ్యర్థి వంశ తిలక్ గొప్ప చదువులు చదువుకున్నారు. డాబు దర్పం లేకపోవచ్చు కానీ సంస్కారవంతుడు. గెలిపిస్తే మచ్చ తేని నాయకుడు. ఆయనను కూడా ఆశీర్వదించమని కోరుతున్నామని, కాంగ్రెస్, %దీ=ా% అభ్యర్థులు మల్కాజగిరికి ఏం చేస్తారో అడగండి? ప్రజలకు తెలిపారు. రియల్ ఎస్టేట్ చేస్తే చేసుకోమనండి. ఈ రాజకీయాలు ఎందుకు వారికి అంటూ మండిపడ్డారు.

## మాజీ మంత్రి తెలంగాణ ఉద్యమకారుడు పట్లోళ్ల ఇంద్రారెడ్డి 24వ వర్ధంతి నేడు

మొదటి పేజీ తరువాయి...

ఉపాధి శాఖ మంత్రిగా పనిచేశారు. ఆ తరువాత 1989 , 1994లో జరిగిన ఎన్నికల్లో వరుసగా గెలిచి ఎన్టీఆర్ మంత్రివర్గంలో హోం , జైళ్లు, అగ్నిమాపక శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 1995 ఆగస్టులో తెలుగుదేశం పార్టీలో జరిగిన సంక్షోభ సమయంలో ఎన్టీ రామారావు పక్షాన నిలిచి ఆయన వెంటనే ఉన్నారు. ఎన్టీఆర్ మరనాంతరం 1996లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీలో చేరి లక్ష్మీపార్వతి తో విభేదించి కాంగ్రెస్ పార్టీలో చేరాడు . పట్లోళ్ల ఇంద్రారెడ్డి 1999 అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ తరపున పోటీ చేసి నాలుగవసారి ఎమ్మెల్యేగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు.

**మరణం :** 2000 సంవత్సరం ఏప్రిల్ 22న షాద్ నగర్‌లో జరిగిన ఓ కార్యకర్త వివాహానికి హాజరై తిరిగి వస్తుండగా శంషాబాద్ మండలం పాల్మాకుల గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంద్రన్న మరణించారు.

**ఇంద్రన్న మరణాంతరం రంగారెడ్డి జిల్లా ప్రజలకు అండగా నిలిచిన పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి:** దివంగత పట్లోళ్ల ఇంద్రారెడ్డికి భార్య పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి, ముగ్గురు కుమారులు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, పట్లోళ్ల కౌశిక్ రెడ్డి , పట్లోళ్ల కళ్యాణ్ రెడ్డిలు ఉన్నారు. ఇంద్రన్న మరణాంతరం సబితమ్మ రంగారెడ్డి జిల్లా ప్రజలకు అండగా నిలిచారు. ఆమె ఎమ్మెల్యేగా, మంత్రిగా జిల్లా ప్రజలకు ఎనలేని సేవలు అందిస్తు వస్తున్నారు. పెద్ద కుమారుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి తండ్రి బాటలో నడుస్తూ ప్రజలకు అండదండలు అందజేస్తున్నారు.

**నేడు రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వర్ధంతి కార్యక్రమాలు :**

సోమవారం రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా స్వర్గీయ ఇంద్రారెడ్డి వర్ధంతి కార్యక్రమాలను ఆయన అభిమానులు స్వచ్ఛందంగా నిర్వహించనున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పీడీపీ చౌరస్తాలో ఇంద్రారెడ్డి అభిమాని ఉప్పర్ పల్లికి చెందిన సామ ఇంద్రపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంద్రారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

## మాజీ మంత్రి పి. ఇంద్రారెడ్డి 24వ వర్ధంతి



ఇంద్రన్న



నిర్వాహకులు, ఇంద్రన్న అభిమాన నాయకుడు సామ ఇంద్రపాల్ రెడ్డి

బుద్వేల్, ఎప్రిల్21(ప్రభాత ఉదయం):తెలంగాణ ఉద్యమానికి నాంది పలికిన మహానాయకుడు , ప్రజల హృదయాలలో చిరకాలం నిలిచి పోయిన మహనీయుడు దివంగత పటోళ్ల ఇంద్రారెడ్డి వర్ధంతి 24వ వర్ధంతి ని సోమవారం ఉదయం 9:30 గంటలకు డైరీ ఫార్మ్ క్రాస్ రోడ్ వద్ద నిర్వహించనున్నట్లు ఇంద్రన్న అభిమాన నాయకుడు సామ ఇంద్రపాల్ రెడ్డి ఓ ప్రకటన లో తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి , రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, తెలంగాణ డైరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బి. జ్ఞానేశ్వర్ ముదిరాజ్ , చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి , ఇంద్రారెడ్డి స్మారక ట్రస్ట్ ట్రస్ట్ చైర్మన్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, కార్పొరేటర్ లు పి అర్చన జయప్రకాష్ ఏం సంగీత గౌరీశంకర్, తోకల శ్రీనివాస్ రెడ్డి లు హాజరవుతారన్నారు . ఇంద్రన్న అభిమానులు, వివిధ పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు





## రేవంత్ రెడ్డిని మెదక్‌కు రప్పించిన ఘనత కేసీఆర్‌ది

మొదటి పేజీ తరువాయి...

విమర్శించారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానని వందరోజులు దాటినా చేయనందుకు చెంపలేసుకుని 60 లక్షల మంది రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మాట తప్పడం, అబద్ధాలు ఆడటం రేవంత్ నైజం అని విమర్శించారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని లోకల్ కాదని రేవంత్ చేసి వ్యాఖ్యలను హరీశ్‌రావు ఖండించారు. ఆయన ఇక్కడే స్థిరపడిన ఓటర్ అని స్పష్టం చేశారు. కొడంగల్‌లో ఓడిపోయి మల్కాజ్‌గిరికి పోయింది నువ్వు అని విమర్శించారు. నా ఎత్తుతో రేవంత్‌రెడ్డికి ఏం పని అని ప్రశ్నించారు. రైతుల గురించి ఆలోంచి, సమస్యలు పరిష్కరించాలని సూచించారు. అహంకారంతో గాల్లో తేలుతున్న కాంగ్రెస్ భూమ్మీదకు రావాలంటే వెంకట్రామిరెడ్డిని పార్లమెంటుకు పంపించాలని పిలుపునిచ్చారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు 18 రోజులుగా వేచిచూస్తున్నా ప్రభుత్వం కొనడం లేదని హరీశ్‌రావు అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తడిచి మొలకెత్తిన ధాన్యాన్ని కూడా కొన్నామని గుర్తు చేశారు. కష్టాల పాలైన రైతులను పరామర్శించడానికి నీకు ఒక్క నిమిషం టైమ్ దొరకడం లేదా అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. మీ పార్టీ నేతలు వీహెచ్, మోత్కుపల్లినే నువ్వు కలవడం లేదు. ఇదేనా ప్రజా పాలన? అని నిలదీశారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను లాక్కునే బదులు ప్రజల కష్టాలు తీర్చాలని హితవు పలికారు. కేసీఆర్‌ను తిడుతూ కాలక్షేపం చేయడం కాదు హామీలను నెరవేర్చాలన్నారు. హామీలు కోసం బాండు రాసిచ్చి బాండ్ల విలువ కూడా తీశావని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెదక్‌లో గెలిచేది బీఆర్ఎస్సే అని ఆయన స్పష్టం చేశారు. జిల్లా ఇచ్చింది మేం, గోదావరి నీళ్లు తెచ్చింది మేం, లక్షల ఉద్యోగాలు ఇచ్చింది మేం. విజ్ఞులైన మెదక్ ఓటర్లు మమ్మల్నే ఆదరిస్తారని పేర్కొన్నారు.

## ఇండియా కూటమి అధికారంలోకి వస్తే సీఏఏ రద్దు చేస్తాం

మొదటి పేజీ తరువాయి...

తీసుకురానున్నట్లు వెల్లడించారు. కేరళకు చెందిన జస్టిస్ కృష్ణ ఈ చట్టాన్ని నొక్కి చెప్పారని చిదంబరం అన్నారు. చివరికి అందరూ బెయిల్ పొందడానికి సుప్రీంకోర్టుకు వెళ్లలేరని, దిగువ న్యాయవ్యవస్థ, మేజిస్ట్రేట్‌లు మరియు జిల్లా న్యాయమూర్తులలో ఈ నియమాన్ని చాలా అరుదుగా పాటిస్తారు, 65 శాతం మంది ఖైదీలు విచారణలో ఉన్నారని, వారంతా దోషులు కాదని వారంతా ఎందుకు జైలులో ఉండాలి..? అని ప్రశ్నించారు. 90 శాతం మంది అండర్ ట్రయల్స్‌లో ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలు ఉన్నారు కాబట్టి మేము ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకువస్తామని చెప్పారు. పోలీసులు, సీబీఐ 15 రోజుల విచారణ తర్వాత ప్రతీ ఒక్కరూ తప్పకుండా బెయిల్ పొందేలా చూస్తామని చెప్పారు.

## బెంగాల్‌లో సీఏఏ అమలును ఎవరూ ఆపలేరు

మొదటి పేజీ తరువాయి...

మభ్యపెట్టేందుకు ఎందుకు ప్రయత్నిస్తున్నారని రాజ్ నాథ్ సింగ్ ప్రశ్నించారు. టీఎంసీ అధికారంలోకి వచ్చిన తర్వాత బెంగాల్‌లో దోపిడీదారులు, నేరస్తులు, అవినీతిపరులు మాత్రమే అభివృద్ధి చెందారని ఆయన ఆరోపించారు. కేంద్ర సంక్షేమ పథకాల ప్రయోజనాలను రాష్ట్ర ప్రభుత్వం నిరాకరిస్తున్నదని బీజేపీ సీనియర్ నేత రాజ్‌నాథ్ సింగ్ ఆరోపించారు.

## 24న తెలంగాణ ఇంటర్ ఫలితాలు

మొదటి పేజీ తరువాయి...


ఏడాది పరీక్ష ఫలితాలను ఇంటర్ బోర్డు ఒకేసారి వెల్లడించనుంది. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు ఇంటర్ పరీక్షలను ప్రభుత్వం నిర్వహించింది. ఈ పరీక్షలకు దాదాపు 10 లక్షల మంది హాజరయ్యారు. మార్చి 10 నుంచి ఈ నెల 10 వరకు మూల్యాంకనాన్ని పూర్తి చేశారు. గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం 15 రోజుల ముందుగానే ఫలితాలు ప్రకటించనున్నారు. మార్కుల నమోదులో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. ఈ నెల మొదటి వారంలో ఓఎంఆర్ షీట్ల డీ కోడింగ్ చేశారు. మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తర్వాత అన్ని విధాలా పరిశీలన చేశారు. ఎలాంటి సమస్యలు లేకపోవడంతో ఫలితాలను విడుదల చేయనున్నారు.



## వినోద్ కుమార్ గళం.. కరీంనగర్‌కు బలం : కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ప్రభాత ఉదయం): బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వినోద్ కుమార్ గళం కరీంనగర్‌కు బలమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు తన అధికారిక ఎక్స్ హ్యాండిల్‌లో ఆయన ఒక పోస్టు పెట్టారు. బీఆర్ఎస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన వినోద్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో వినోద్‌కుమార్ చురుకైన పాత్ర పోషించారని కేటీఆర్ కొనియాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముద్దుబిడ్డ వినోద్ కుమార్.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2001లో ఏర్పాటైన టీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరని పేర్కొన్నారు. 2004లో ఎంపీగా గెలిచిన తర్వాత పార్లమెంట్‌లో 32 పార్టీలు తెలంగాణకు అనుకూలంగా లేఖలు ఇవ్వడంలో వినోద్ కుమార్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు.

## భవిష్యత్తు తరాల అభివృద్ధి కోసం పని చేయడమే మోడీ లక్ష్యం



హైదరాబాద్, ఏప్రిల్ 18 (ప్రభాత ఉదయం): భవిష్యత్తు తరాల అభివృద్ధి కోసం పని చేయడమే మోడీ లక్ష్యమని ఎంపీ రాజ్యసభ లక్ష్మణ్ అన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని కీస్ హై స్కూల్ లో తమిళ తులువా వెళ్లాల (ముదాలియర్) కమ్యూనిటీ వారు నిర్వహించిన తమిళ్ న్యూ ఇయర్ సెలబ్రేషన్ కార్యక్రమానికి బిజెపి రాజ్యసభ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. తమిళ సోదరులందరికి తమిళ న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. నిజాం పరిపాలన అనంతరం తమిళనాడు నుండి చాల మంది హైదరాబాద్ వచ్చి సెట్టెల్ అయ్యారని అన్నారు. సుదూర ప్రాంతాల నుండి హైదరాబాద్ వచ్చి ఇక్కడ స్థిరపడి ఎదుగుగారు అంటే చాల సంతోషమన్నారు. తమిళనాడుతో దేశం మొత్తం ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. దేశంలో అనేక ప్రాంతం లో తమిళ భాషను గుర్తిస్తున్నారని తెలిపారు. ప్రధాని కూడా తమిళ భాషను ప్రత్యేకంగా గుర్తించారని అన్నారు. అనేక రంగాల్లో తమిళులు ఉన్నత స్థాయికి ఎదిగారని తెలిపారు. ప్రధాని మన్ కి బాత్ కార్యక్రమంలో కూడా తమిళుల గురించి మాట్లాడిన సందర్భం ఉందన్నారు. తమిళ ప్రజలన్న తమిళ భాషన్న కూడా ప్రధానికి ప్రత్యేక అభిమానం ఉందన్నారు. కాశీకి రామేశ్వరానికి ఉన్న సంబంధాన్ని గుర్తించింది కూడా ప్రధాని మోడీ నే అన్నారు. తమిళ చరిత్రను డిల్లీ వరకు చేర్చారని తెలిపారు. ముదలియర్ కమ్యూనిటీ వారు ఎక్కువగా ఇక్కడ స్థిరపడ్డారని తెలిపారు. వారికి తగిన గుర్తింపు కావాలని ఈ సంఘం వారు కోరుతున్నారని అన్నారు. గతంలో ఇక్కడ బీసీ లుగా వారిని గుర్తించామన్నారు. ఇప్పుడు దేశ వ్యాప్తంగా ఓబీసీ లో గుర్తింపు కావాలని వారు విజ్ఞప్తి చేశారని తెలిపారు. ఓబీసీ జాబితాలో లేకపోవడం వల్ల వారు సైనిక్ స్కూల్లో, నవోదయ స్కూల్ లో రిజర్వేషన్ దక్కించుకోలేక పోతున్నామని తెలియజేశారు. జాతీయ స్థాయిలో వారి కమ్యూనిటీ నీ ఓబీసీ లిస్ట్ లో చేర్చితే ఈ సమస్య తీరుతుందని నా దృష్టి కి తీసుకొచ్చారని తెలిపారు. నేను ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడి హోదాలో మీ సమస్యను తీర్చడానికి కృషి చేస్తానని తెలిపారు. జాతీయ స్థాయిలో 27 శాతం రిజర్వేషన్ కూడా విద్యారంగంలో ఇప్పించేందుకు కృషి చేస్తానని అన్నారు. విసెన్ ఉన్న గొప్ప వ్యక్తి మన ప్రధాని మోడీ అని తెలిపారు. భవిష్యత్తు తరాల అభివృద్ధి కోసం పని చేయడమే మోడీ లక్ష్యమన్నారు. అందుకే యువతకు స్కిల్ డెవలప్మెంట్ సంబంధిత కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. దేశంలో వారి వారి కుటుంబ సభ్యుల కోసం రాజకీయాలు చేస్తున్నారని తెలిపారు.

## మరో అభ్యర్థుల జాబితాను విడుదల చేసిన కాంగ్రెస్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం): 2024 లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా , కాంగ్రెస్ ఆదివారం (ఏప్రిల్ 21) మరో అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. ఈ అభ్యర్థుల జాబితాలో ఆంధ్రప్రదేశ్ నుంచి 9 మంది, జారండ్ నుంచి ఇద్దరు అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించింది. అమలాపురం నుంచి జంగా గౌతమ్, మచిలీపట్నం నుంచి గొలు కృష్ణ పేర్లను ఖరారు చేసింది అధిష్టానం. జారండ్‌లోని గొడ్డా నుంచి దీపికా సింగ్ పాండే స్థానంలో ప్రదీప్ యాదవ్‌ను కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించింది. కాగా, రాంచీ అభ్యర్థిగా యశస్విని సహాయ్‌ను ఎంపిక చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం నుంచి పెడాడ పరమేశ్వరరావు, విజయనగరం నుంచి బొబ్బిలి శ్రీను, అమలాపురం నుంచి జంగా గౌతమ్, మచిలీపట్నం నుంచి గొలు కృష్ణ, విజయవాడ నుంచి వల్లూరు భార్గవ, ఒంగోలు నుంచి ఈదా సుధాకర్‌రెడ్డి, నంద్యాల నుంచి జంగిటి లక్ష్మీ నరసింహ యాదవ్‌లను పార్టీ బరిలోకి దింపింది. అనంతపురం నుంచి మల్లికార్జున్‌కు, హిందూపురం నుంచి సమద్ షాహీన్‌కు టికెట్ ఇచ్చారు. జారండ్‌లోని గొడ్డా లోక్‌సభ స్థానం నుంచి నిషికాంత్ దూబేకి బీజేపీ టికెట్ ఇచ్చింది. కాగా, రాంచీ లోక్‌సభ స్థానానికి బీజేపీ సంజయ్ సేథ్‌ను బరిలోకి దింపింది. ఈ స్థానం నుంచి దీపికా సింగ్ పాండే స్థానంలో ప్రదీప్ యాదవ్‌ను కాంగ్రెస్ అభ్యర్థిగా నిలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 25 లోక్‌సభ స్థానాలు ఉండగా, జారండ్‌లో మొత్తం 14 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఏప్రిల్ ప్రారంభంలో కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్‌లోని ఆరు లోక్‌సభ స్థానాలు, 12 అసెంబ్లీ స్థానాల జాబితాను విడుదల చేసింది. ఇక వచ్చేనెల 13న ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణలో పోలింగ్ జరుగనుంది.

## మణిపూర్‌లో 11 చోట్ల రీపోలింగ్

మొదటి పేజీ తరువాయి...

ఘటనలు చోటు చేసుకున్న మొత్తం 11 ప్రాంతాల్లో ఏప్రిల్ 22న (సోమవారం) ఉదయం 7:00 నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఈ రీపోలింగ్ నిర్ణయం తీసుకున్నామని అధికారులు తెలిపారు. "ఖురాయ్ నియోజకవర్గంలోని మొయిరంగ్‌కంపు సాజేబ్, తొంగమ్ లైకై, ఇంఫాల్ తూర్పు జిల్లాలోని క్షేత్రీగావ్‌లో నాలుగు, థోంగ్జులో ఒకటి, ఉరిపోక్‌లో మూడు, ఇంఫాల్ పశ్చిమ జిల్లాలోని కొంతౌజామ్‌లో ఒకటి".. ఇలా మొత్తం 11 ప్రాంతాల్లో రీపోలింగ్ జరగనుంది. పోలింగ్ బూత్‌ల వద్ద కాల్పులు, బెదిరింపులు, ఈవీఎంలను ధ్వంసం చేసిన సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఈ కారణంగానే రీపోలింగ్ జరపనున్నట్లు పేర్కొన్నారు. అయితే శుక్రవారం ఇన్నర్ మణిపూర్, ఔటర్ మణిపూర్‌లలో 72 శాతం పోలింగ్ జరిగినట్లు సమాచారం. బూత్‌లను కబ్జా చేశారని, ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ 47 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఇన్నర్ మణిపూర్ నియోజకవర్గంలోని 36, ఔటర్ మణిపూర్ నియోజకవర్గంలోని 11 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేసినట్లు మణిపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.మేఘచంద్ర తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే యత్నం చేస్తే.. బీఆర్ఎస్‌ను నామారూపాలు లేకుండా చేస్తాం

మొదటి పేజీ తరువాయి...

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నం చేస్తే.. రాత్రికి రాత్రే బీఆర్ఎస్ ను నామరూపాలు లేకుండా చేస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. భువనగిరి ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. తనకు రాజకీయంగా పునర్జన్మ, రాజగోపాల్ రెడ్డి కి రాజకీయ జన్మ ఇచ్చింది భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గమన్నారు. పోటరాటాల ఖిల్లా, కాంగ్రెస్ కంచుకోట భువనగిరిలో భారీ మెజారిటీతో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆకాంక్షించారు. భువనగిరిలో కాంగ్రెస్ కు పోటీ లేదని స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నా.. వంద రోజులకే ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా తెలంగాణకు చేసింది శూన్యమని విమర్శించారు.ప్రతిపక్ష పార్టీ నేతగా ఉన్న తాను రాష్ట్రానికి కావాల్సిన అభివృద్ధి నిధులు తీసుకువచ్చానన్నారు. సీఎం గా ఉండి లక్షల సార్లు కేసీఆర్ అబద్ధాలు చెప్పాడని ఆరోపించారు. రేవంత్ రెడ్డి నాకు అత్యంత సన్నిహితుడని, సోదరసమానుడన్నారు. 20 ఏళ్లు తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని జోష్యం చెప్పారు. 10 ఏళ్ల పాలనలో లక్ష రూపాయల రుణమాఫీ చేయని కేసీఆర్ కు రుణమాఫీ పై మాట్లాడే అర్హత లేదని మండిపడ్డారు. కేసీఆర్ ఓ వేస్ట్ ఫెలో ఆయన గురించి మాట్లాడి సమయం వృథా చేయనన్నారు. అనంతరం భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పుడే ఆట మొదలైందని.. రేవంత్ రెడ్డికి ఇరు వైపులా కోమటిరెడ్డి బ్రదర్స్ ఉన్నారన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో చిన్న పొరపాటుతో ఒక్క సీటు కోల్పోయామని.. ఈ ఎన్నికల్లో భువనగిరి ఎంపీగా చామాల కిరణ్ కుమార్ రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు.



# కోట మైసమ్మ దేవాలయంలో భక్తి శ్రద్ధలతో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు



బుద్వేల్ కోట మైసమ్మ అమ్మ వారిని దర్శించుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, తదితరులు



కోట మైసమ్మ దేవాలయం వద్ద ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్


బుద్వేల్, ఏప్రిల్21(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ కోట మైసమ్మ దేవాలయం లో అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఆదివారం కన్నుల పండుగగా జరిగింది. తెల్లవారుజాము నుండి రేవల్లే రాజు శర్మ పంతులతోపాటు వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలను నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం అనంతరం నిర్వహించిన పూజా కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు రాష్ట్ర గౌడ సంఘం కోశాధికారి పి. హరిచరణ్ గౌడ్ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అంతకుముందు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ దేవాలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు . సాయంత్రం అమ్మవారికి స్థానిక ప్రాంతాలకు చెందిన మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు. అమ్మవారికి బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు మరికొంతమంది స్థానిక ప్రాంతాలకు చెందిన మహిళలు ఒడిబియ్యం అమ్మవారికి సమర్పించారు. ఈ పూజా కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రేమ్ దాస్ గౌడ్, స్వర్గీయ ఇంద్రారెడ్డి ట్రస్ట్ చైర్మన్ కార్తీక్ రెడ్డి, దేవాలయ కమిటీ ప్రతినిధులు దాస్ గౌడ్,పెంటయ్య గౌడ్, నందం గౌడ్,సత్యనారాయణ గౌడ్, నరసింహా గౌడ్, వినాయక గౌడ్, పెంద్యాల శ్రీధర్ వై శ్రీధర్, పెంద్యాల సాయి మల్లిక్, మజ్జిగ నరేష్ యాదవ్ తో పాటు కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.



తగులబడి పోతున్న ఇన్నోవా కారు

## ప్రమాదవశాత్తు కారులో మంటలు


బుద్వేల్, ఏప్రిల్21(ప్రభాత ఉదయం): నడుస్తున్న కారు ఒక్కసారి ఆగిపోయి మంటలు అంటుకోవడంతో ఆ కారు పూర్తిగా తగలబడిపోయింది. ఈ సంఘటన శనివారం రాత్రి 10:45 నిమిషాలకు శివరాంపల్లి నేషనల్ పోలీస్ అకాడమీ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. తాడ్ బంద్ కు చెందిన షహాబాజుల్లా ఖాన్ ప్రైవేట్ ఉద్యోగి . అతనికి చెందిన ఇన్నోవా కారు ఏపీ09 బి ఎల్ 6177లో స్నేహితుడు అబ్దుల్ ఖదీర్ తో కలిసి శనివారం రాత్రి ఆరాంఘర్ కు వెళ్ళాడు. రాత్రి 10 45 నిమిషాలకు తిరిగి ఇంటికి వెళుతుండగా నేషనల్ పోలీస్ అకాడమీ సమీపంలో కారు ఆగిపోయింది . వెంటనే కారు లోంచి మంటలు రావడంతో కారు లో ఉన్న ఇద్దరూ కిందికి దిగిపోయారు . ఈ సంఘటనలో 2007 మోడల్ కు చెందిన ఇన్నోవా కారు పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



కొత్తకోట పట్టణంలో హస్తం గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## ఎంపీగా డాక్టర్ వంశీచంద్రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపిస్తాం

కొత్తకోట, ఏప్రిల్ 21(ప్రభాత ఉదయం) మహబూబ్ నగర్ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వంశీ చందర్ రెడ్డి ని భారీ మెజార్టీతో గెలిపిస్తా మని కొత్తకోట మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆదివారం దేవరకద్ర నియోజకవర్గ శాసనసభ్యులు జిఎంఆర్ సూచన మేరకు కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో 4. వ వార్డు లో కాంగ్రెస్ పార్టీ పాలమూరు పార్లమెంటు అభ్యర్థి చల్ల వంశీచంద్ రెడ్డి చేతి గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు . ఈ ప్రచార కార్యక్రమనికి కొత్తకోట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి మేస్త్రి శ్రీనన్న ఆధ్వర్యంలో ప్రచారకార్యక్రమం జరిగింది. ఈ ప్రచారంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యాక్షులు పల్లెపాగు ప్రశాంత్ పాలమూరు పార్లమెంటు అభ్యర్థి చల్లా వంశీ చంద్ రెడ్డి ని చేతి గుర్తుకు ఓటు వెయ్యాలని ఇంటింటి ప్రచారం నిర్వహించరు వంశన్న కాంగ్రెస్ పార్టీ చేతు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు .ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కార్యదర్శులు ఎన్ జె బోయజ్, మాజీ జెడ్పిటిసి పి జె బాబు, ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి ,కొత్తకోట మున్సిపల్ కోఅప్షన్ సభ్యులు జెఎంమీషేక్,13. వ వార్డ్ కౌన్సిలర్ పి రాంమోహన్ రెడ్డి, రాష్ట్ర ఫిషర్ మెన్ కార్యదర్శి సంద వెంకటేష్, లక్ష్మయ్య, పి రవీందర్ రెడ్డి,డబ్బు లక్ష్మయ్య, కొమ్ము క్రాంతికుమార్, వి శ్యామ్,, జె కె రాజు,ఎం భాస్కర్,సాయిలు యాదవ్, జె కృష్ణయ్య,భాస్కర్ కురుపన్న,ఎన్ సాయిలు, జె. జాన్, ఈజాజ్ అలీ,కొమ్ము సుజ్ఞానం, ఎం. అజన్న, నాగరాజు , శ్రీకాంత్,నవీన్ రెడ్డి, దిలీప్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ నవీన్ కుమార్ ప్రచారకర్యాకమంలో పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్

కొత్తకోట, ఏప్రిల్ 21(ప్రభాత ఉదయం): కొత్తకోట మండలం భూత్కూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు, భూత్కూర్ గ్రామ సర్పంచ్ నర్సింగమ్మ , ఉప సర్పంచ్ అంజలమ్మ , రాములు, ఆంజనేయులు, చెన్న కిష్టాన్న, ఆంజనేయులు పలువురు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున...స్థానిక నాయకుల ఆధ్వర్యంలో దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూధన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా జియంఆర్ ఆహ్వానించారు, ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన కు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరామని తెలిపారు.



డీసీపీ నారాయణరెడ్డి కి వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

## గ్రామంలో సమస్యలు సృష్టిస్తున్న వారిపై చర్య తీసుకోండి

### డీసీపీకి వినతి పత్రం అందించిన ముచ్చింతల గ్రామస్తులు

శంషాబాద్, ఏప్రిల్ 21( ప్రభాత ఉదయం ) శంషాబాద్ మండలంలోని ముచింతల గ్రామాభివృద్ధికి ఎనలేని సేవలు అందించిన వారిపై ఆరోపణలు చేస్తున్న వ్యక్తులపై చర్య తీసుకోవాలని ఆ గ్రామస్తులు శంషాబాద్ డిసిపి నారాయణరెడ్డి కి ఫిర్యాదు చేశారు . తెలంగాణ ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నరసింహ తన స్వార్థం కోసం గ్రామంలో సమస్యలు సృష్టిస్తున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. మై హెూమ్ సంస్థ యాజమాన్యం గ్రామంలో దాదాపు ఐదు కోట్ల రూపాయలతో రెంటంతస్తుల పాఠశాల భవనాన్ని నిర్మించారని వివరించారు . 2018 సంవత్సరం వరకు గ్రామంలోని వృద్ధులకు పేదవారికి ప్రతి నెల ఐదు కిలోల సన్న బియ్యం తో పాటు 250 రూపాయలు వృద్ధాప్య పెన్షన్ను అందజేశారని తెలిపారు. దీంతోపాటు గ్రామంలోని వివిధ సమస్యల పరిష్కారం కోసం తమ సొంత డబ్బులను వెచ్చించి గ్రామాభివృద్ధికి తోడ్పడ్డారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. నరసింహ తన స్వార్థం కోసం గ్రామంలో ప్రజల మధ్యన విభేదాలు సృష్టిస్తున్నారని గ్రామాభివృద్ధికి తోడ్పడిన సంస్థ యాజమాన్యంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అతనిపై చటపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు కోరారు.



## విద్యార్థుల భరతనాట్య రంగ ప్రవేశం

### విద్యార్థి బృందం నృత్యప్రతిభ తో అందరిని అలరించారు

రవీంద్ర భారతి, ఏప్రిల్ 21(ప్రభాత ఉదయం): నిత్య నృత్యాలయ తర్ఫీదులో చిన్నారులు కుమారి వనం శ్రాగ్వి, వనం విఖ్యాతి, ఖైరవి చేరిక మిత్ర విద్యార్థి బృందం నృత్యప్రతిభ తో అందరిని అలరించారు. నయమనోహరం భరతనాట్య విన్యాసం చక్కటి నృత్యాభినయంతో తొలి ప్రదర్శనలోనే నృత్య సంగీతాభిమానులను మంత్రముగ్ధులను చేశారు."జై జవాన్ జై కిసాన్ జై కళాకార్ "ఆర్గనైజేషన్ కల్చరల్ ఫెస్టివల్ ఫౌండర్ ప్రెసిడెంట్ -కె వి రమణారావు ఆధ్వర్యం హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రముఖ నాట్య గురువు రేణుక శిష్యురాళ్ళు వనం శ్రాగ్వి, వనం విఖ్యాతి, ఖైరవి చేరిక భరతనాట్య రంగ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా పుష్పాంజలితో నృత్యారంభం చేసిన శ్రియా గణేశా స్తుతి, మయురా అలరింపు, జతిస్వరం, శబ్దం, వర్ణం వంటి అంశాలను ప్రదర్శించి నాట్యప్రియులను ఆకట్టకున్నారు. ప్రముఖ సాంస్కృతిక ప్రోస్తాహకులు దైవజ్ఞ శర్మ సాంస్కృతిక కార్యక్రమానికి హాజరై చిన్నారులకు మంచి సందేహాన్ని ప్రోస్తాహకాన్ని అందించి కళా ప్రదర్శనలను ప్రారంభించారు. ప్రతిభావంతులకు అవార్డులు అందజేశారు. కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో అద్భుత నృత్య కళాకారిణులు గా సర్టిఫికెట్స్ ప్రశంసా పత్రాలు అందజేశారు.



పార్టీ శ్రేణులకు సూచనలు చేస్తున్న బిజెపి రాష్ట్ర నాయకులు బొక్క బొక్క బాల్ రెడ్డి

## పాలమూరు ఎంపీ బిజెపి అభ్యర్థి డీకే అరుణను భారీ మెజారిటీతో గెలిపించాలి

### బిజెపి రాష్ట్ర నాయకులు బొక్క బాల్ రెడ్డి

మక్తల్, ఏప్రిల్ 21(ప్రభాత ఉదయం) పాలమూరు ఎంపీ బిజెపి అభ్యర్థి డీకే అరుణ ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని బిజెపి రాష్ట్ర నాయకులు బొక్క బాల్ రెడ్డి అన్నారు. ఆదివారం మహబూబ్ నగర్ పార్లమెంట్ లోని మండల సమావేశాలు మక్తల్ టౌన్ , మక్తల్ మండల్ ,ఆత్మకూరు మండల్ ,ఆత్మకూరు మున్సిపాలిటీ, అమరచింత మండల్, ఆత్మకూరు మున్సిపాలిటీ ,కృష్ణా మండల్,సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్ రెడ్డి మాట్లాడుతూ... పోలింగ్ ప్రతి బూత్ అధ్యక్షులు ఇంటింటికి ప్రచారం నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ పథకాలు కరపత్రాల ద్వారా ఇంటింటికి చేరవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య, అసెంబ్లీ కన్వీనర్ కర్ణ స్వామి, పార్లమెంట్ కన్వీనర్ భీమ్ రెడ్డి , జిల్లా ఉపాధ్యక్షులు సోమశేఖర్ గౌడ్, జిల్లా కార్యదర్శి కల్లూరి నాగప్ప, ఎంపీటీసీ బలరామరెడ్డి , నరాల నారాయణ అశోక్, సీనియర్ నాయకులు మేరువం రాజు రాజశేఖర్ రెడ్డి మక్తల్ టౌన్ ప్రెసిడెంట్ లక్ష్మణ్ మక్తల్ మండల ప్రెసిడెంట్ విష్ణువర్ధన్ రెడ్డి ఆత్మకూరు మండల అధ్యక్షులు , బిజెపి మూడు మండలాల పోలింగ్ బూత్ ప్రెసిడెంట్ లు, ఎంపీటీసీలు ,మాజీ సర్పంచులు పాల్గొన్నారు.




## ఘనంగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ భూపాల్ రెడ్డి కుమారుడు వివాహం

### నూతన వధూవరులను ఆశీర్వదించిన చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్, ఏప్రిల్ 21(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఉప్పర్ పల్లికి చెందిన తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ భూపాల్ రెడ్డి కుమారుడు వరుణ్ పాల్ రెడ్డి, శ్రద్ధారెడ్డిల వివాహం శంషాబాద్ లోని జిఎంఆర్ ఏరియాలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ వివాహానికి చేవెళ్ల పార్లమెంటు సభ్యులు డాక్టర్ జి రంజిత్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రేమ్ రాజ్, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ ఎన్ మల్లారెడ్డి, బిజెపి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వైస్ శ్రీధర్, బిజెపి రాష్ట్ర నాయకులు బొక్క బాల్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.





నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

## పలు వివాహ వేడుకలు, శుభ కార్యాలకు హాజరైన దేవరకద్ర ఎమ్మెల్యే

దేవరకద్ర, ఏప్రిల్ 21(ప్రభాత ఉదయం) మహబూబ్ నగర్, అమిస్తాపూర్, భూత్పూర్ , మూసాపేట్ మండలం కొమ్మిరెడ్డి పల్లి, జానంపేట్ గ్రామాల్లో పలు వివాహ వేడుకలు, శుభ కార్యాలకు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కొత్తకోట, అప్పరాల, భూత్కూర్ గ్రామాల్లో పలు వివాహాలకు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# పంజాబ్ కింగ్స్‌పై గుజరాత్ గెలుపు

## 3 వికెట్ల తేడాతో విజయం

**ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2024లో శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని గుజరాత్ టైటాన్స్ జట్టు నాలుగో విజయాన్ని నమోదు చేసింది. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచులో 3 వికెట్లు తేడాతో గెలుపొంది ఈ ఫీట్ సాధించింది. పంజాబ్ నిర్దేశించిన 143 పరుగుల లక్ష్యాన్ని మరో 5 బంతులు మిగిలి ఉండగానే ఛేజ్ చేసింది. ఫలితంగా పాయింట్ల పట్టికలో ఆరో స్థానానికి ఎగబాకింది.**






పంజాబ్ కింగ్స్‌పై గుజరాత్ టైటాన్స్ విజయం సాధించింది. 3 వికెట్ల తేడాతో గెలుపొందింది. పంజాబ్ ధీటైన బౌలింగ్‌తో కట్టడి చేసినప్పటికీ నిలకడగా ఆడుతూ గుజరాత్ బ్యాటర్లు లక్ష్యాన్ని చేరుకున్నారు. 5 బంతులు మిగిలి ఉండగానే టార్గెట్ ఛేధించారు. 143 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగిన గుజరాత్ బ్యాటర్లు లక్ష్యాన్ని చేరుకునేందుకు చాలానే ప్రయాస పడ్డారు. శుభ్‌మన్‌గిల్ (35), సాయి సుదర్శన్ (31) ఇద్దరూ ఫర్వాలేదనిపించారు. పంజాబ్ బౌలింగ్‌లో మిగిలిన బ్యాటర్లు అందరూ తేలిపోయారు. అయినప్పటికీ ఓవరాల్‌గా తలా కొంత స్కోర్ చేయడం జట్టుకు ప్లస్ అయ్యింది. ఇక చివరలో రాహుల్ తెవాటియా (31) విజృంభించడంతో 19.1 ఓవర్‌లోనే లక్ష్యాన్ని ఛేధించి.. పంజాబ్‌ను ఓడించారు. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ దూకుడుగా ఇన్నింగ్స్ మొదలుపెట్టింది. కానీ పవర్ ప్లే పూర్తయ్యేలోపే తొలి వికెట్‌ను కోల్పోయింది. అప్పట్నుంచి పంజాబ్‌కు కష్టాలు మొదలయ్యాయి. ఏడో ఓవర్‌లో చివరి బంతికి రొస్సోవ్ (9).. ఎనిమిదో ఓవర్‌లో ఐదో బంతికి కరన్ (20) ఔటయ్యారు. ఈ రెండు వికెట్ల విషయంలో పంజాబ్ రివ్యూకు వెళ్లినప్పటికీ పంజాబ్‌కు వ్యతిరేకంగానే ఫలితం వచ్చింది. వరుసగా రెండు వికెట్లను కోల్పోవడంతో పంజాబ్ పరుగుల వేటలో నెమ్మదించింది. గుజరాత్ బౌలర్లను తట్టుకోలేక నిలకడగా ఆడుతూ వచ్చింది. దీంతో పవర్‌ప్లే పూర్తయ్యే సరికి 56 పరుగులు చేసిన పంజాబ్.. 10 ఓవర్లకు 74 పరుగులు మాత్రమే చేసింది. ఇక 11వ ఓవర్ నుంచి పంజాబ్ మళ్లీ వరుసగా వికెట్లను కోల్పోయింది. 11వ ఓవర్‌లో రెండో బంతికి లివింగ్‌స్టన్ (6) ఔటయ్యాడు. 12వ ఓవర్‌లో నాలుగో బంతికి జితేశ్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. 14వ ఓవర్‌లో ఆశుతోష్ (3) కూడా ఔటయ్యాడు. తొలి బంతికి రివ్యూ వెళ్లడంతో సానుకూల ఫలితం వచ్చింది. కానీ ఐదో బంతికి భారీ సిక్స్ కొట్టేందుకు యత్నించి క్యాచ్ ఔట్ అయ్యాడు. 16వ ఓవర్‌లో రెండో బంతికి శశాంక్ సింగ్ (8) కూడా ఔటయ్యాడు. 19వ ఓవర్‌లో చివరి బంతికి భారీ సిక్స్ కొట్టేందుకు ప్రయత్నించిన బ్రార్ (29) షారుక్‌ఖాన్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఇక చివరి ఓవర్‌లో హర్షల్ పటేల్ (0), భాటియా (14) వికెట్‌ను పంజాబ్ కోల్పోయింది. ఫలితంగా నిర్ణీత 20 ఓవర్లు ముగిసేసరికి 142 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. గుజరాత్ బౌలర్లలో సాయి కిశోర్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. నూర్ అహ్మద్, మోహిత్ శర్మ చెరో రెండు వికెట్లు తీయగా.. రషీద్ ఖాన్ ఒక వికెట్ తీశాడు. 143 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగిన గుజరాత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. నాలుగో ఓవర్‌లో నాలుగో బంతికి వృద్ధిమాన్ సాహా (13) ఔటయ్యాడు. 10వ ఓవర్‌లో మూడో బంతికి శుభ్‌మన్ గిల్ (35) ఔటయ్యాడు. రబాడా బౌలింగ్‌లో భారీ సిక్స్ కొట్టేందుకు యత్నించి లివింగ్‌స్టోన్‌కు క్యాచ్ ఇచ్చాడు. 11వ ఓవర్‌లో లివింగ్‌స్టోన్ వేసిన ఐదో బంతికి మిల్లర్ (4) బౌల్డ్ అయ్యాడు. 15వ ఓవర్‌లో మూడో బంతికి ఫోర్ బాదిన సాయి సుదర్శన్.. నాలుగో బంతికి బౌల్డ్ అయ్యాడు. ఆ వెంటనే 16వ ఓవర్‌లో హర్షల్ పటేల్ వేసిన రెండో బంతికి ఒమర్జాయ్ (13) క్యాచ్ ఔటయ్యాడు. దీంతో గుజరాత్ పరుగుల వేగం తగ్గింది. ఒక రకంగా కష్టాల్లోకి వెళ్లిపోయింది. కష్టకాలంలో క్రీజులోకి వచ్చిన రాహుల్ తెవాటియా (32) విజృంభించాడు. ఇక గుజరాత్ విజయం ఖాయమైందని అనుకుంటున్న తరుణంలో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. 19వ ఓవర్‌లో గుజరాత్ రెండు వికెట్లను కోల్పోయింది. 19వ ఓవర్‌లో మొదటి బంతికి షారుక్‌ఖాన్ (4), చివరి బంతికి రషీద్‌ఖాన్ (3) ఔటయ్యారు. అయినప్పటికీ తెవాటియా నిలకడగా ఆడి టార్గెట్‌ను ఛేధించాడు. పంజాబ్ బౌలర్లలో హర్షల్ పటేల్ మూడు వికెట్లు, లివింగ్‌స్టోన్ రెండు వికెట్లు పడగొట్టారు. అర్షదీప్, శామ్ కరన్ చెరో వికెట్ తీశారు.

# ఆర్సీబీని వదలని దరిద్రం..

## ఉత్కంఠ పోరులో ఒక్కపరుగు తేడాతో ఓటమి.. ఇక ఇంటికే..!


**ఐపీఎల్ 2024 రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుసగా ఆరో ఓటమిని నమోదు చేసింది. ఆదివారం కేకేఆర్‌తో జరిగిన మ్యాచ్‌లో ఒక్క పరుగు తేడాతో ఓడిపోయింది. కేకేఆర్ నిర్దేశించిన 223 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సరిగ్గా 20 ఓవర్లకు 221 పరుగులకు ఆలౌట్ అయింది. చివరి ఓవర్‌లో 21 పరుగులు అవసరం కాగా.. మూడు సిక్సర్లు బాది కర్ణ్ శర్మ జట్టును పోటీలోకి తెచ్చాడు. కానీ చివర్లో ఔట్ కావడంతో విజయానికి ఒక్క పరుగు దూరంలో ఆగిపోయింది.**





ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2024లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఉత్కంఠ పోరులో ఒక్క పరుగు తేడాతో కేకేఆర్ చేతిలో ఓడిపోయింది. కోల్‌కతా వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత కేకేఆర్ 222/6 పరుగులు చేసింది. అనంతరం ఆర్సీబీ సరిగ్గా 20 ఓవర్లలో 221 పరుగులకు ఆలౌట్ అయింది. స్టార్క్ వేసిన చివరి ఓవర్‌లో 3 సిక్సర్లు బాదిన కర్ణ్ శర్మ.. మ్యాచ్‌ను తారాస్థాయికి తీసుకెళ్లాడు. కానీ అతడు ఔట్ కావడంతో ఆర్సీబీ ఒక్క పరుగుతో ఓటమిని చవి చూసింది. అనంతరం 223 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు తొలి 20 బంతుల్లోనే ఓపెనర్లు ఇద్దరూ ఔట్ అయ్యారు. విరాట్ కోహ్లీ (18), ఫాఫ్ డుప్లెసిస్ (7) స్వల్ప స్కోరుకే ఔట్ అయ్యారు. ఈ దశలో విల్ జాక్స్, రజత్ పటిదార్‌లు దూకుడుగా ఆడారు. సిక్స్‌లు ఫోర్లతో చెలరేగడంతో 11 ఓవర్లు ముగిసే సరికి ఆర్సీబీ.. 137/2తో నిలించింది. దీంతో ఈజీగా గెలిచేలా కనిపించింది. కానీ హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్న తర్వాత ఇద్దరూ ఔట్ అయ్యారు. విల్ జాక్స్ 32 బంతుల్లో 55, రజత్ పటీదార్ 23 బంతుల్లో 52 పరుగులు చేసి ఔట్ అయ్యారు. %ఆ తర్వాత కామెరూన్ గ్రీన్ (6), మహిపాల్ లామ్రోర్ (4) ఔట్ కావడంతో 155/6తో నిలిచి.. కష్టాల్లో పడింది. ఈ సీజన్‌లో విశేషంగా రాణిస్తున్న దినేశ్ కార్తిక్ క్రీజులో ఉండటంతో ఆర్సీబీ విజయంపై ఆశతోనే ఉంది. కానీ 19 ఓవర్‌లో దినేశ్ కార్తిక్ (18 బంతుల్లో 25 రన్స్) ఔట్ కావడంతో ఆర్సీబీ పోరాటం ముగిసిందని అంతా భావించారు. చివరి ఓవర్‌లో 21 పరుగులు అవసరం కాగా.. ఆర్సీబీ ఓటమి లాంఛనమే అనుకున్నారు. కానీ ఆర్సీబీ ప్లేయర్ కర్ణ్ శర్మ సంచలన బ్యాటింగ్ చేశాడు. మిచెల్ స్టార్క్ బౌలింగ్‌లో తొలి మూడు బంతుల్లో ఏకంగా 3 సిక్సర్లు కొట్టాడు. అయితే ఐదో బంతికి అతడు ఔట్ కావడం, ఆరో బంతికి ఒకే పరుగు రావడంతో ఆర్సీబీ ఒక్క పరుగు తేడాతో ఓడిపోయింది. చివరకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 221 పరుగులకు ఆలౌట్ అయింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన కోల్‌కతా నైట్‌రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 222/6 పరుగులు చేసింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 36 బంతుల్లో 50, ఫిల్ సాల్ట్ 14 బంతుల్లో 48 రన్స్‌తో రాణించారు. చివర్లో రమన్‌దీప్ సింగ్ 9 బంతుల్లో 24 రన్స్‌తో మెరుపులు మెరిపించాడు. ఆర్సీబీ బౌలర్లలో యశ్ దయాల్ 2, కామెరూన్ గ్రీన్ 2, మహమ్మద్ సిరాజ్ 1, లుకీ ఫెర్గుసన్ 1 వికెట్ తీశారు.





# శ్రియా.. గుండెల్లో గుచ్చిందయ్యా..

## సండే ట్రీట్ అదిరింది

శ్రియా నాలుగు పదుల వయసుకు దగ్గర్లో ఉన్నా, ఓ బిడ్డకు జన్మను ఇచ్చినా కూడా ఇంకా అదే ఫిట్ నెస్, అదే అందాన్ని మెయింటైన్ చేస్తూ వస్తోంది. శ్రియా ఆ మధ్యే ముంబైకి షిఫ్ట్ అయిన సంగతి తెలిసిందే. శ్రియా అందాలను ఎంతగా ప్రదర్శిస్తూ ఉన్నా కూడా టాలీవుడ్ మేకర్లు మాత్రం ఆమెను అంతగా పట్టించుకుంటున్నట్టుగా కనిపించడం లేదు. శ్రియా మాత్రం నెట్టింట్లో తన అభిమానుల్ని ఇలా అందాలతో ఆకట్టుకుంటోంది.

# కార్తికేయ కోసం మెగాస్టార్

## టీజర్ లాంచ్ చేసిన చిరు



కార్తికేయ మెగా ఫ్యాన్ అన్న సంగతి తెలిసిందే. చిరంజీవికి హార్డ్ కోర్ ఫ్యాన్స్ లిస్ట్‌లో కార్తికేయ టాప్ ప్లేస్‌లో ఉంటాడు. చిరంజీవికి నివాళిగా కార్తికేయ చేసిన డ్యాన్స్ పర్ఫామెన్స్ అందరికీ తెలిసిందే. చిరు డ్యాన్సులు, యాక్షన్ చూస్తూ పెరిగిన కార్తికేయ.. మెగాస్టార్‌కు వీరాభిమానిగా మారిపోయాడు. అందుకే తన అభిమాన హీరో చేతుల మీదుగా తన మూవీ టీజర్ లాంచ్ అవ్వడంతో ఫుల్ ఖుషీ అవుతున్నాడు. కార్తికేయ హీరోగా యూవీ క్రియేషన్స్ నిర్మించిన భజే వాయు వేగం మూవీ టీజర్‌ను శనివారం నాడు విశ్వంభర సెట్‌లో చిరంజీవి లాంచ్ చేశాడు. యూవీ కాన్సెప్ట్స్‌లో విక్కీ నిర్మాతగా, దర్శకుడు ప్రశాంత్ రెడ్డి చంద్రపు రూపొందించిన భజే వాయు వేగం టీజర్, టైటిల్ ఆసక్తికరంగా, ఆకట్టుకునేలా ఉన్నాయన్నాడు. తన అభిమాని, తమ్ముడు లాంటి కార్తికేయ హీరోగా నటిస్తున్న సినిమా ఇదని చెప్పుకొచ్చాడు. తన అభిమాని హీరోగా ఓ మంచి సినిమాలో నటిస్తున్నాడంటే ఆ సినిమా బాగుండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటానని అన్నాడు.



# అశ్వత్థామగా అమితాబ్..

## ఏట్టకేలకు కల్కి అప్డేట్

ప్రభాస్ నాగ్ అశ్విన్ కాంబోలో తెరకెక్కిన కల్కి 2898 ఏడీ మూవీ మీదున్న అంచనాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. పాన్ ఇండియా కాదు.. పాన్ వరల్డ్ స్థాయిలో సినిమాను నాగ్ అశ్విన్ మలిచాడు. ఈ మూవీలో అమితాబ్ బచ్చన్, దీపిక పదుకొణె, కమల్ హాసన్, దిశా పటానీ వంటి వారెంతో మంది నటించారు. మే 9న రావాల్సిన ఈ మూవీని ఎన్నికల కారణంగా వాయిదా వేస్తారనే రూమర్లు గత కొన్ని రోజులుగా నెట్టింట్లో చక్కర్లు కొడుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఈ చిత్రం నుంచి అదిరిపోయే అప్డేట్ ఇచ్చారు. అసలే దేశం మొత్తం ఐపీఎల్ ఫీవర్‌లో ఉంది. అందుకే స్టార్ స్పోర్ట్స్ చానెల్‌లో అమితాబ్ పాత్రకు సంబంధించిన అప్డేట్‌ను వదిలారు. ప్రస్తుతం ఈ అప్డేట్ నేషనల్ వైడ్‌గా ట్రెండ్ అవుతోంది. అశ్వత్థామ పాత్రలో అమితాబ్ కనిపించబోతోన్నాడనే రూమర్ ఇప్పుడు నిజమైంది. చిరంజీవి అయిన అశ్వత్థామగా అమితాబ్ కల్కిలో కనిపించబోతోన్నాడు. ఈ మేరకు రిలీజ్ చేసిన గ్లింప్స్ అదిరిపోయింది. ఎవరు నువ్వు.. నీకు మరణం అన్నదే లేదా? నువ్వు దేవుడివా? ఎవరు నువ్వు? అని ఓ బాలుడు అడుగుతాడు. నేను ద్వాపర యుగం నుంచీ ఉన్నాను.. గురు ద్రోణాచార్యుడి పుత్రుడను.. అశ్వత్థామను అని అమితాబ్ చెప్పే డైలాగ్ అదిరిపోయింది. ఇందులో విజువల్స్, ఆర్ఆర్ ఇంటర్నేషనల్ లెవెల్లో ఉన్నాయని జనాలు పొగిడేస్తున్నారు. అయితే ఈ మూవీ రిలీజ్ డేట్ విషయంలో మాత్రం ఇంకా క్లారిటీ రాలేదు. మే చివర్లో లేదా జూన్ చివర్లో విడుదల చేయాలని మేకర్లు అనుకుంటున్నారట. డిస్ట్రిబ్యూటర్లు ఒక డేట్.. నిర్మాత ఇంకో డేట్.. హీరో మరో డేట్ అని అనుకుంటున్నారట. చివరకు ఏ డేట్‌ను ప్రకటిస్తారో చూడాలి. ఈ సినిమా నుంచి వచ్చే ప్రతీ కంటెంట్ అంచనాలను పెంచుకుంటూనే పోతోంది. ఇప్పుడు అమితాబ్‌ను అశ్వత్థామగా పరిచయం చేస్తూ వదిలిన గ్లింప్స్ నేషనల్ వైడ్‌గా ట్రెండ్ అవుతోంది.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. “RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.